
సీసీ కెమెరాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ దయానంద్‌గుప్తా, కార్పొరేటర్

సీసీ కెమెరాలతో నేరాల నివారణ సాధ్యం

● ఎమ్మెల్సీ దయానంద్‌గుప్తా, కార్పొరేటర్ పవన్‌కుమార్

కొత్తపేట, మే 26(ఆంధ్రజ్యోతి): సీసీ కెమెరాలతో నేరాల నివారణ, నిర్ధారణ సాధ్యమని ఎమ్మెల్సీ దయానంద్‌గుప్తా, కార్పొరేటర్ పవన్‌కుమార్ తెలిపారు. కొత్తపేట డివిజన్ న్యూమారుతీనగర్ కమ్యూనిటీహాల్‌లో ఏర్పాటు చేసిన 56 సీసీ కెమెరాలను వారు సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాలనీల్లో, ప్రతీ ఇంట్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని నేరాలు జరిగినప్పుడు పోలీసులకు సహకరించాలని కోరారు. సీసీ కెమెరాల నిఘాతో ప్రజల భద్రత పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు నీరంకి రవి, ప్రతినిధులు ప్రభాకర్, రవికేశవ్, మహేష్, శ్రీనివాస్, సత్తయ్య పాల్గొన్నారు.


డివిజన్ అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని జోనల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్ వెంకటేశ్వర్‌రెడ్డి

డివిజన్ అభివృద్ధికి నిధులు మంజూరు చేయండి

వనస్థలిపురం, మే 26(ఆంధ్రజ్యోతి): డివిజన్ అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని వనస్థలిపురం కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్‌కు కార్పొరేటర్ కాలనీవాసులతో కలిసి సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ డివిజన్‌లోని పలు కాలనీల్లోని సమస్యల పరిష్కారానికి నిధులు మంజూరుచేసి అభివృద్ధికి సహకారం అందించాలన్నారు. కాలనీవాసులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో పలు కాలనీల అధ్యక్షులు బద్దం రాంరెడ్డి, కంచి కృష్ణమోహన్, హరినాథ్‌రెడ్డి, నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.


గుడిసెల అగ్ని ప్రమాద బాధితులకు వంట పాత్రలు, చీరలను పంపిణీ చేస్తున్న సీపీఐ నాయకులు

వంట పాత్రలు, చీరల పంపిణీ

అబ్దుల్లాపూర్‌మెట్, మే 26(ఆంధ్రజ్యోతి): పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీ కుంట్లూర్ పరిధిలోని ఆర్ఎన్ఆర్ కాలనీ ఫేజ్-3లో గుడిసెల ప్రమాద బాధితులకు సీపీఐ ఉమ్మడి ఖమ్మం జిల్లా, రంగారెడ్డి జిల్లా పార్టీ ఆధ్వర్యంలో సోమవారం వంట పాత్రలు, మహిళలకు చీరలను పంపిణీ చేశారు. ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు భాగం హేమంత్‌రావు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి ఎండీ షామీర్‌పాష, రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అందోజు రవీంద్రాచారి, కౌన్సిల్ సభ్యుడు ముత్యాల యాదిరెడ్డి కార్యక్రమానికి హాజరై బాధితులకు వంటపాత్రలు, చీరలను అందించారు. కార్యక్రమంలో పానుగంటి పర్వతాలు, సామిడి శేఖర్‌రెడ్డి, పబ్బతి లక్ష్మణ్, అజ్మీర్ హరిసింగ్‌నాయక్, యాదగిరి, నవనీత, అరుణ, నారాయణరెడ్డి, సైదులు, వీరేష్, శ్రీదేవి, నక్రునాయక్, గణేష్ పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే సుధీర్‌కుమార్‌కు ఘన నివాళి


మాజీ ఎమ్మెల్యే సుధీర్‌కుమార్ విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

చంపాపేట, మే 26 (ఆంధ్రజ్యోతి) : చంపాపేట డివిజన్ కర్మన్‌ఘాట్‌లో మలక్‌పేట మాజీ ఎమ్మెల్యే పి.సుధీర్‌కుమార్ వర్ధంతిని కాంగ్రెస్ నాయకులు సోమవారం జరుపుకున్నారు. సుధీర్‌కుమార్ విగ్రహానికి పలువురు నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో నాయకులు ఈపూరి బద్రీనాథ్, కొయిలకొండ సునీల్‌కుమార్, శివకుమార్, వెంకట్‌రెడ్డి, శుభోదయకాలనీ అధ్యక్షుడు శ్రీకాంత్‌గౌడ్ పాల్గొన్నారు.


సుధీర్‌కుమార్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మార్కెట్‌కమిటీ మాజీ చైర్మన్ పురుషోత్తంరావు, వైస్ చైర్మన్ శ్రీనివాస్, మాజీ ఫ్లోర్ లీడర్ వెంకటేష్‌యాదవ్

ఎల్బీనగర్, మే 26(ఆంధ్రజ్యోతి): యువజన కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే దివంగత సుధీర్‌కుమార్‌కు నేతలు ఘనంగా నివాళులర్పించారు. సుధీర్‌కుమార్ వర్ధంతి సందర్భంగా పీఅండ్‌టీకాలనీ చౌరస్తాలోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. గడ్డిఅన్నారం మున్నూరుకాపు సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పుట్టం పురుషోత్తంరావు, వైస్ చైర్మన్ కోట్ల శ్రీనివాస్, గడ్డిఅన్నారం పురపాలక సంఘం మాజీ ఫ్లోర్ లీడర్ వెంకటేష్‌యాదవ్, మాజీ కౌన్సిలర్లు త్రివేది, రమేష్ ముదిరాజ్, ప్రేమ్‌నాథ్‌గౌడ్, అనంతుల నవీన్‌కుమార్, సునీల్, పుట్టం విజేందర్, మేకల అంజయ్య, రాజు, క్రాంతి, అశోక్ పాల్గొన్నారు.


కామాక్షీ సహిత చంద్రమౌళీశ్వరస్వామిని దర్శించుకుంటున్న భక్తులు

చంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలో చండీహోమం

అబ్దుల్లాపూర్‌మెట్, మే 26(ఆంధ్రజ్యోతి): అబ్దుల్లాపూర్‌మెట్‌లోని కామాక్షీ సహిత చంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలో గోసంరక్షణలో భాగంగా సోమవారం చండీహోమం నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి రుద్రాభిషేకంతో పాటు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గోపూజ చేశారు. గోమాతలు సుభిక్షంగా ఉండాలని, సనాతన ధర్మం నిత్యం వర్ధిల్లాలని ఆకాంక్షిస్తూ ప్రతి నెల చతుర్దశి అమావాస్య సమయంలో చండీహోమం నిర్వహించనున్నట్లు రామకృష్ణ స్వామి శర్మ తెలిపారు. ప్రతి అమావాస్యకు భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమంలో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సూర్యనారాయణశర్మ, మొక్కపాటి సీతారామశాస్త్రీ, వేదమనిశర్మ, రోహిత్‌శర్మ పాల్గొన్నారు.

వారు జరిమానా విధించరు..

వీరు చెత్త వేయక మానరు

హయత్‌నగర్, మే 26(ఆంధ్రజ్యోతి): పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీ పరిధిలోని కల్వంచ శాంతినగర్ రోడ్డు నంబర్-2 చెత్త డంపింగ్ యార్డ్‌లాగా తయారు అయింది. కొంత మంది స్థానికులు చెత్తను ఆటోలకు వేయకుండా ద్విచక్ర వాహనాల మీద తీసుకువచ్చి అక్కడ పారవేస్తున్నారు. మరి కొందరు తెల్లవారుజామున వాకింగ్‌కు వస్తూ ఇంట్లోని చెత్తను తీసుకువచ్చి అక్కడ వేస్తున్నారు. ఇష్టం ఉన్నట్లు చెత్త వ్యర్థాలను ప్లాస్టిక్ కవర్లలో కట్టి అక్కడ పార వేస్తున్నారు. దీంతో రెండు రోజుల్లోనే అక్కడ పెద్ద డంపింగ్ యార్డులాగా చెత్తకుప్ప ఏర్పడుతుంది. చెత్త వల్ల రోడ్డు మొత్తం దుర్గంధభరితంగా మారుతుంది. మున్సిపాలిటీ శానిటేషన్ అధికారులు ఎంత చెప్పినా స్థానికుల తీరు మారకపోవడంతో వారు అక్కడ ఒక ఫ్లెక్సీని ఏర్పాటు చేశారు. 'ఈ ప్రదేశంలో చెత్త వేసిన వారు శిక్షార్హులు.. ఈ ప్రదేశం సీసీ కెమెరాల పర్యవేక్షణలో ఉన్నందుకు చెత్తవేసిన వారికి చట్టరీత్యా జరిమానా విధించబడును' అని హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేశారు. అయినా స్థానికులు మాత్రం అక్కడ చెత్తను వేస్తూనే ఉన్నారు. డోంట్ కేర్ అంటూ రోజు చెత్తను అక్కడే పారవేస్తున్నారు. అధికారులు ఫ్లెక్సీని ఏర్పాటు చేశారు. కానీ రోజు ఎవరు చెత్తను వేస్తున్నారో సీసీ కెమెరాలను పరిశీలించి బాధ్యులపైన చర్యలు తీసుకోవడం లేదు.



అక్కడ చెత్త వేయవద్దని మున్సిపల్ అధికారులు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

చెత్త వద్ద ఇరవై వీధి కుక్కలు

ఇంట్లో తడి చెత్త వ్యర్థాలను ప్లాస్టిక్ కవర్లలో పెట్టి అక్కడ వేయడం వల్ల వీధి కుక్కలు అక్కడికి చేరుకుంటున్నాయి. దాదాపు 20 వీధి కుక్కలు రోజు రోడ్డుపైనే పడుకుని ఉంటున్నాయి. వాకింగ్‌కు వచ్చే వారిపైన దాడి చేస్తున్నాయి. వాకర్స్ రోజు కర్రలను వెంట తెచ్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. నిత్యం రద్దీగా ఉండే ఈ రోడ్డుపైనే కుక్కలు పడుకుని ఉండడం వల్ల పాదాచారులు, మహిళలు, పిల్లలు, వృద్ధులు అక్కడి నుంచి ఇంటికి రావడానికి బయపడుతున్నారు. వీధి కుక్కలు చెత్తతో నిండి ఉన్న ప్లాస్టిక్ కవర్లను నోటితో తీసుకుని వచ్చి రోడ్డుపైన వేసి చిందరవందరగా వేస్తున్నాయి. దీంతో రోడ్డుపైన నడవ లేని పరిస్థితి ఉంటుంది. ఇప్పటికైనా పెద్దఅంబర్‌పేట్ మున్సిపల్ అధికారులు చెత్తను వేస్తున్న వారిని గుర్తించి వారిపైన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.


కల్వంచ శాంతినగర్ రోడ్డు నంబర్-2 వద్ద పేరుకుపోయిన చెత్త

పాకిస్థాన్‌ను మోకరిల్లేలా చేసిన ఆపరేషన్ సిందూర్

● ఎంపీలు విశ్వేశ్వర్‌రెడ్డి, రాజేందర్

ఎల్బీనగర్, మే 26(ఆంధ్రజ్యోతి): భారతీయ మహిళల నుదిటిపై సిందూరాన్ని తుడిచేసిన వారిపై ఆపరేషన్ సిందూర్ అంటూ విరుచుకుపడి ఉగ్రవాదులకు వంతపాడే పాకిస్థాన్‌ను భారత్ ముందు మోకరిల్లేలా చేసిన భారతీయ వీరవనితలు వ్యోమికాసింగ్, సోఫియా ఖురేషిలు దేశానికి గర్వకారణమని ఎంపీలు కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, ఈటల రాజేందర్ అన్నారు. సిటిజెన్స్ ఫర్ నేషనల్ సెక్యూరిటీ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి నిర్వహించిన తిరంగా ర్యాలీ ముగింపు సభ వాసవీకాలనీ ఆర్చి సమీపంలో ఏర్పాటు చేశారు. ఈ సభలో వారు మాట్లాడుతూ పాకిస్థాన్ ఉగ్రమూకల స్థావరాలను నామరూపాలు లేకుండా చేసి భారతదేశ శక్తిసామర్థ్యాలను ప్రపంచదేశాలకు చాటి చెప్పారన్నారు. భారతజాతి ఆత్మగౌరవాన్ని నిలబెట్టడంలో భారత సైన్యంతో పాటు ప్రధాని మోదీకి మనమంతా అండగా నిలవాలన్నారు. సైన్యంతో పాటు ఉగ్రవాదంపై పోరాడేందుకు యువత సిద్ధంగా ఉందన్నారు. కార్యక్రమంలో సామాజిక సమరసత వేదిక రాష్ట్ర కన్వీనర్ అప్పల ప్రసాద్, బీజేపీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు వనిపల్లి శ్రీనివాస్‌రెడ్డి(అర్బన్), రాజ్‌భూపాల్‌గౌడ్ (రూరల్), ప్రధాన కార్యదర్శి పిట్టా ఉపేందర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు ఆరుట్ల సురేష్, మాజీ అధ్యక్షుడు సామ రంగారెడ్డి, రాష్ట్ర కార్యవర్గసభ్యులు అందెల శ్రీరాములు యాదవ్, ధీరజ్‌రెడ్డి, బీజేపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్లు కొప్పుల నర్సింహారెడ్డి, రాధాధీరజ్‌రెడ్డి, కార్పొరేటర్లు వంగా మధుసూదన్‌రెడ్డి, మొద్దు లచ్చిరెడ్డి, పవన్ కుమార్, రంగా నర్సింహగుప్తా, బద్దం ప్రేమ్‌మహేశ్వర్ రెడ్డి, అరుణ సురేందర్‌యాదవ్, ఆకుల శ్రీవాణి, బీజేపీ ఎల్బీనగర్ కన్వీనర్ కొత్త రవీందర్‌గౌడ్ పాల్గొన్నారు.


సభలో మాట్లాడుతున్న ఎంపీ ఈటల రాజేందర్, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

సైదాబాద్ ఏసీపీగా వెంకట్‌రెడ్డి

సైదాబాద్, మే 26(ఆంధ్రజ్యోతి): సైదాబాద్ డివిజన్ ఏసీపీగా సోము వెంకట్‌రెడ్డి సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు ఉన్న ఏసీపీ వెంకన్ననాయక్‌ను డీజీపీ ఆఫీస్‌కు బదిలీ చేశారు. ఆయన స్థానంలో తూప్రాన్ డీఎస్పీగా పనిచేస్తున్న సోము వెంకట్‌రెడ్డి సైదాబాద్ డివిజన్‌కు బదిలీ అయ్యారు. దీంతో సోమవారం బాధ్యతలు చేపట్టిన వెంకట్‌రెడ్డిని ఇన్‌స్పెక్టర్లు, ఎస్ఐలు కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

చదువుకోమని తల్లి మందలించిందని

మనస్తాపంతో విద్యార్థి ఆత్మహత్య


రిషి(ఫైల్)

సైదాబాద్, మే 26 (ఆంధ్రజ్యోతి): సరిగా చదవడంలేదని కొడుకును తల్లి మందలించింది. ఆ మందలింపు వెనుక ఉన్నది తన భవిష్యత్తుపై ఆమెకున్న బెంగ మాత్రమే అని అర్థం చేసుకోలేకపోయిన ఆ విద్యార్థి మనస్తాపంతో ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన సైదాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. వినయ్‌నగర్‌లోని రాధారెసిడెన్సీలో కంబాలపల్లి సుజాత, వెంకటయ్య కుటుంబం వాచ్‌మెన్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నారు. వీరి పెద్దకుమారుడు కంబాలపల్లి రిషి(16) ఇటీవల పదో తరగతిలో ఫెయిల్ అయ్యాడు. దీంతో మానసిక ఒత్తిడికి గురికావడంతో కుటుంబసభ్యులు ధైర్యం చెప్పారు. త్వరలో జరగబోయే సప్లిమెంటరీ పరీక్షలకు ప్రిపేర్ అయ్యేందుకు ట్యూషన్ పెట్టించారు. ఈ క్రమంలో శనివారం ఇంట్లో ఫోన్‌లో మొబైల్ గేమ్ ఆడుతుండగా, ఆదివారం టీవీ చూస్తుండగా తల్లి మందలించింది. దీంతో మనస్తాపానికి గురైన రిషి సోమవారం మధ్యాహ్నం అపార్ట్‌మెంట్ పైకి వెళ్లి ఐరన్ స్టెప్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తల్లి ఫిర్యాదు మేరకు సైదాబాద్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పాత భవనానికి.. ఎంపీ ప్రారంభోత్సవమా..!

చంపాపేట, మే 26(ఆంధ్రజ్యోతి): బీజేపీ స్థానిక నేతల అత్యుత్సాహం, కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధుల ఆరాటంతో పాత భవనానికి కొత్తగా పాత తేదీలో ఎంపీచే ప్రారంభోత్సవం చేయించడం పట్ల పలువురు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. హస్తినాపురం డివిజన్ జడ్పీరోడ్‌లోని శ్రీరమణకాలనీ ఫేజ్-2లో జీహెచ్ఎంసీ పార్కులో రెండేండ్ల కిందట కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు కమ్యూనిటీహాల్ నిర్మాణం చేపట్టారు. అందులోనే వినాయక మండపం ఏర్పాటు చేస్తూ వస్తున్నారు. ఈ భవనంలోనే గవర్నర్ ఇంద్రసేనారెడ్డిని కాలనీ ప్రతినిధులు, బీజేపీ నేతలు ఇటీవల సన్మానించారు. ఆదివారం సాయంత్రం అకస్మాత్తుగా ఎంపీ ఈటల రాజేందర్‌ను ముఖ్య అతిథిగా పిలిచి కమ్యూనిటీహాల్ ప్రారంభోత్సవం చేయించారు. శిలాఫలకం పైన మాత్రం 30-06-2024 తేదీ ఉండడం విశేషం. స్థలం జీహెచ్ఎంసీ వారిది.. సోకు బీజేపీ వారిది మాదిరిగా కనిపిస్తుంది. పాత తేదీ వేసి ఎంపీ ఈటలని స్థానిక బీజేపీ నేతలు, కాలనీ సంక్షేమ సంఘం వారు బోల్తా కొట్టించడం ఎంత వరకు సమంజసం. కొత్త తేదీ వేసుకొని ప్రోటోకాల్ ప్రకారం అందరిని ఆహ్వానించి ప్రారంభోత్సవం చేసుకుంటే వచ్చే నష్టం ఏమిటో వారికే తెలియాలి.


శ్రీరమణకాలనీ ఫేజ్-2లో కమ్యూనిటీహాల్‌కు ప్రారంభోత్సవం చేస్తున్న ఎంపీ ఈటల రాజేందర్(ఫైల్)

నిధులు మంజూరైనట్లు కార్పొరేటర్ పేర్కొన్నా..

హస్తినాపురం డివిజన్‌లోని వందనపురికాలనీ నుంచి కేకే గార్డెన్ వరకు వరదనీటి కాలువ నిర్మాణం కోసం రూ.7.5కోట్లు మంజూరైనట్లు ఈనెల 14న జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ మెంబర్, కార్పొరేటర్ సుజాతానాయక్ ప్రకటించారు. ఆదివారం ఎంపీ ఈటల రాజేందర్‌ను స్థానిక బీజేపీ నేతలు ఆ స్థలం వద్దకు తీసుకెళ్లి వరద నీటి కాలువ సమస్యను వివరించి పరిష్కరించాలని కోరడం విశేషం. కొత్త పనులకు ఎంపీని నిధులు కోరాలే తప్ప నిధులు మంజూరైన వరదనీటి కాలువ ప్రాంతాన్ని ఎంపీకి చూపించడం చర్చనీయాంశమైంది.


శ్రీరమణకాలనీ ఫేజ్-2లో ఆదివారం ఎంపీ ఈటల రాజేందర్ చేతుల మీదుగా పాత తేదీలో ఆవిష్కరించిన ప్రారంభోత్సవ శిలాఫలకం

వాణిజ్య పంటల సాగుపై దృష్టి సారించాలి

● అవగాహన సదస్సులో శాస్త్రవేత్త సునీత

అబ్దుల్లాపూర్‌మెట్, మే 26(ఆంధ్రజ్యోతి): సంప్రదాయ పంటలతో పాటు వాణిజ్య పంటల సాగుపై రైతులు దృష్టి సారించాలని సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ సునీత సూచించారు. రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ మండలం గండిచెరువు గ్రామంలో సోమవారం రైతు ముగింట్లో శాస్త్రవేత్తలు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సీనియర్ శాస్త్రవేత్తలు డాక్టర్ సునీతతో పాటు, డాక్టర్ రాజశేఖర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వ్యవసాయ పద్ధతుల గురించి రైతులకు అవగాహన కల్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ రైతులు పంట మార్పిడి పద్ధతులను పాటించాలని సూచించారు. వానిజ్య పంటల సాగుతో రైతులు ఆర్థికంగా అభివృద్ధి సాధించవచ్చన్నారు. రసాయన ఎరువుల వాడకం తగ్గించి సేంద్రియ ఎరువుల వినియోగాన్ని పెంచుకోవాలన్నారు. పంట సాగుకు ముందు తప్పనిసరిగా వ్యవసాయ అధికారుల సలహాలు, సూచనలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ భాస్కరాచారి, మండల విస్తరణ అధికారి రఘుపతి, కృష్ణారెడ్డి, రైతులు పాల్గొన్నారు.


అవగాహన సదస్సులో మాట్లాడుతున్న శాస్త్రవేత్త సునీత


విజయ సంకేతం చూపుతున్న రేయాన్ విద్యార్థులు

సైనిక్ స్కూల్ ఫలితాల్లో 'రేయాన్'కు ర్యాంకులు

మన్సూరాబాద్, మే 26(ఆంధ్రజ్యోతి): ఆలిండియా సైనిక్ స్కూల్-2025 ఫలితాల్లో నాగోల్‌లోని రేయాన్ సైనిక్ స్కూల్ విద్యార్థులు జాతీయస్థాయిలో మొదటి ర్యాంకు సాధించారు. ఈ సందర్భంగా స్కూల్ చైర్మన్ జి.జనార్దన్‌రెడ్డి మాట్లాడుతూ 5, 8వ తరగతిలో ప్రవేశాలకు జాతీయ స్థాయిలో ఆలిండియా సైనిక్ స్కూల్ పరీక్షలు జరిగాయన్నారు. 5వ తరగతికి జరిగిన పరీక్షా ఫలితాల్లో హనీష్‌రెడ్డికి జాతీయస్థాయిలో 4వ ర్యాంకు, 8వ తరగతికి జరిగిన పరీక్షా ఫలితాల్లో అశ్వర్థకి జాతీయస్థాయి మొదటి ర్యాంకు సాధించారన్నారు. వీరితో పాటు ఉత్తమ ర్యాంకు సాధించిన విద్యార్థులను రేయాన్ కేంద్రంలో జనార్దన్‌రెడ్డి అభినందించారు. మెరిట్ సాధించిన, ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులకు ఉచితంగా, ఫీజులో రాయితీ కల్పించడం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు.

భాగ్యనగర్ సొసైటీలో అందుబాటులో వరి విత్తనాలు

● 25కిలోల బస్తా ధర రూ.1100

● చైర్మన్ నర్సింహారెడ్డి వెల్లడి

సరూర్‌నగర్, మే 26(ఆంధ్రజ్యోతి): బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లోని నాదర్‌గుల్‌లో గల భాగ్యనగర్ రైతు సేవా సహకార సంఘంలో ప్రస్తుత వ్యవసాయ సీజన్‌కుగాను బీపీటీ వరి విత్తనాలు అందుబాటులో ఉన్నాయని, అవసరమున్న రైతులు తీసుకెళ్లాలని సంఘం చైర్మన్ మర్రి నర్సింహారెడ్డి పేర్కొన్నారు. సోమవారం ఆయన పలువురు రైతులకు సదరు విత్తనాలు(వడ్లు) అందజేశారు. ఈసందర్భంగా మర్రి మాట్లాడుతూ ప్రస్తుతం సంఘంలో 100 బస్తాలు అందుబాటులో ఉన్నాయని, రూ.1100కు ఒక బస్తా చొప్పున రైతులకు విక్రయిస్తున్నామని చెప్పారు. అధిక దిగుబడిని ఇచ్చే బీపీటీ రకం వరి విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో సంఘం మాజీ చైర్మన్ పెత్తుల్ల పుల్లారెడ్డి, సంఘం కార్యదర్శి పిండి నారాయణరెడ్డి, లింగారెడ్డి పాల్గొన్నారు.


రైతులకు వరి విత్తనాలు అందజేస్తున్న చైర్మన్ నర్సింహారెడ్డి, మాజీ చైర్మన్ పుల్లారెడ్డి


మలక్‌పేటలోని మెట్రో క్యూర్ ఆస్పత్రిలో అత్యవసర వైద్య చికిత్సలు అందుకున్న పారపల్లి భారతికి ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా మంజూరైన రూ.2.25లక్షల చెక్కును కాంగ్రెస్ పార్టీ మలక్‌పేట ఇన్‌చార్జి షేక్ అక్బర్ సోమవారం అందజేశారు. - చాదర్‌ఘాట్, ఆంధ్రజ్యోతి

స్టార్మ్ వాటర్ బాక్స్‌డ్రెయిన్ సమస్య పరిష్కారానికి చర్యలు

● జెడ్సీ హేమంత్ కేశవ్ పాటిల్

కొత్తపేట, మే 26(ఆంధ్రజ్యోతి): అల్కాపురి జంక్షన్ నుంచి మూసీ వరకు నిర్మించిన స్టార్మ్ వాటర్ బాక్స్‌డ్రెయిన్‌ను క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాత పైప్‌లైన్‌ను అనుసంధానం చేయాలని కార్పొరేటర్ పవన్‌కుమార్ సూచించారు. పైప్‌లైన్, బాక్స్‌డ్రైన్ ప్రాంతాన్ని మరోసారి పరిశీలించి డ్రైనేజీ సమస్యకు పరిష్కార చర్యలు తీసుకుంటామని జీహెచ్ఎంసీ ఎల్బీనగర్ జెడ్సీ హేమంత్ కేశవ్ పాటిల్ వెల్లడించారు. కామినేని చౌరస్తా వద్ద జరుగుతున్న స్టార్మ్‌వాటర్ డ్రెయిన్ పనులను ఇటీవల పరిశీలించిన తర్వాత ఔట్‌లెట్ సరిగా లేని స్టార్మ్ వాటర్ డ్రైన్‌తో వరద, నీరు, మురుగునీటి ముంపు సమస్య తలెత్తుతోందని పనులు ఆపాలని పవన్‌కుమార్ జెడ్సీకి విన్నవించారు. ఈ నేపథ్యంలో సోమవారం ఆయన, ఆర్కేపురం కార్పొరేటర్ రాధాధీరజ్‌రెడ్డితో కలిసి జెడ్సీ, ఎస్ఈ అశోక్‌రెడ్డి, డీసీ సుజాతలు బాక్స్‌డ్రైన్‌ను పరిశీలించారు. ప్రస్తుతం ఉన్న భూగర్భ డ్రైనేజీ పైప్‌లైన్ బాక్స్‌డ్రైన్ కింద ఉందని, పలు చోట్ల సదరు డ్రైనేజీ పైప్‌లైన్ ధ్వంసమైందని దీంతో వరదనీరు మురుగునీరు పరిసరాలను ముంచెత్తుతున్నాయని కార్పొరేటర్లు అధికారులకు వివరించారు. జలమండలి, జీహెచ్ఎంసీ అధికారులు సమన్వయంతో డ్రైనేజీ, వరద ముంపు సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలన్నారు. నూతనంగా సీవరేజీ లైన్‌ను ఎక్కువ లోతున వేసేందుకు చర్యలు తీసుకోవాలని అభిప్రాయం వ్యక్తం చేశారు. సుమారు రూ.40కోట్లతో ఎల్బీనగర్ నుంచి మూసీ వరకు నూతన డ్రైనేజీ పైప్‌లైన్ నిర్మాణానికి జలమండలి వారు అంచనాలు సిద్ధం చేసినట్లు తెలిసిందన్నారు. పాత భూగర్భ డ్రైనేజీ పైప్‌లైన్ అక్కడక్కడ ధ్వంసమై ఉండవచ్చని దీంతోనే భారీ వర్షాలకు స్నేహపురి వేంకటేశ్వర ఆలయ ప్రాంగణాన్ని తరచూ వరదనీరు ముంచెత్తుతోందని స్నేహపురికాలనీ అధ్యక్షుడు అనంతుల సురేందర్ రెడ్డి అధికారులకు విన్నవించారు.

నూతన డ్రైనేజీ పైప్‌లైన్ కోసం..

ఎల్బీనగర్ నుంచి మూసీ వరకు నూతన డ్రైనేజీ పైప్‌లైన్ నిర్మాణం కోసం జలమండలి అధికారులు ఉన్నతాధికారులకు డీపీఆర్ అందజేసినట్లు తెలిసిందని జీహెచ్ఎంసీ ఎస్ఈ అశోక్‌రెడ్డి, ఈఈ కార్తీక్ తెలిపారు. మరోమారు బాక్స్‌డ్రైన్ ప్రాంతాన్ని పరిశీలించి తగిన చర్యలు తీసుకునే అవకాశం ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో జలమండలి డీజీఎం వర్మ, జీహెచ్ఎంసీ ఏఈ షరీఫ్, జలమండలి ఏఈ స్రవంతిరెడ్డి, బీజేపీ రాష్ట్ర నాయకుడు ధీరజ్‌రెడ్డి, కొత్తపేట నాయకులు పాల్గొన్నారు.


డ్రైనేజీని పరిశీలిస్తున్న జెడ్సీ హేమంత్ కేశవ్ పాటిల్, కార్పొరేటర్ పవన్‌కుమార్, ధీరజ్‌రెడ్డి తదితరులు

యువకుడి ప్రాణాలను బలిగొన్న మద్యం మత్తు


పవన్‌కుమార్ (ఫైల్)

రామంతాపూర్, మే 26 (ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో చోటుచేసుకున్న చిన్నపాటి వివాదం ఓ యువకుడి ప్రాణాలను బలిగొన్న సంఘటన ఉప్పల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని రామంతాపూర్‌లో ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... రామంతాపూర్ గుడ్ డే బార్‌లో ఆదివారం రాత్రి అంబర్‌పేట్ పటేల్‌నగర్‌కు చెందిన హరి, పవన్ కుమార్, శ్రవణ్ అనే స్నేహితులు మద్యం తాగారు. ఈ నేపథ్యంలో ఏదో విషయమై హరి, శ్రవణ్ గొడవకు దిగారు. దీంతో పవన్ గొడవ ఆపేందుకు ప్రయత్నించాడు. కోపంతో శ్రవణ్ పవన్ కుమార్ తలపై బీర్ సీసాతో కొట్టడంతో పవన్ అక్కడికక్కడే మృతి చెందాడు. సంఘటన స్థలాన్ని పరిశీలించిన పోలీసులు కేసును నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.